పోలీసు పహారాలో విత్తనాల పంపిణీ

పచ్చిరొట్ట విత్తనాలకు భారీగా డిమాండ్

- సరిపడా సరఫరా చేయని కాంగ్రెస్ సర్కారు
- గంటల తరబడి క్యూలైన్లలో నిల్చొని నిరీక్షణ
- ఓపిక లేక లైన్లో పాస్‌బుక్‌ల జిరాక్స్ ప్రతులు
- సీజన్‌కు ముందే అన్నదాతకు కష్టాలు
- విత్తనాలు దొరకక నిరాశతో వెనుదిరిగిన రైతులు

జగిత్యాల జిల్లా మల్యాలలో పచ్చిరొట్ట విత్తనాల కోసం క్యూలో పెట్టిన పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు

జగిత్యాల జిల్లా నూకపల్లి సహకార సంఘం వద్ద పచ్చిరొట్ట విత్తనాల కోసం క్యూలో ఉన్న రైతులు

నిజామాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/మల్యాల/గొల్లపల్లి/కామారెడ్డి రూరల్: పచ్చిరొట్ట విత్తనాల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. సోమవారం పోలీసు పహారా నడుమ విత్తనాలు పంపిణీ చేయడమే అందుకు నిదర్శనం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలకు భారీ డిమాండ్ ఉంది. ప్రాథమిక సహకార కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ప్రభుత్వం.. డిమాండ్‌కు సరిపడా స్టాక్‌ను ఉంచలేదు. దీంతో రైతులు తెల్లవారుజామునే పీఏసీఎస్‌ల ఎదుట క్యూ కట్టారు. ఎండకు తాళలేక చెప్పులు, పాస్‌బుక్‌ల జిరాక్స్ ప్రతులను లైన్లో పెట్టి పొద్దంతా నిరీక్షించారు. మొన్న రాజంపేటలో రైతన్నలు ఎండలో నిల్చొని సొమ్మసిల్లారు. తాజాగా కామారెడ్డిలోని పీఏసీఎస్‌లో పోలీస్ పహారా నడుమ జీలుగ విత్తనాలను పంపిణీ చేయాల్సి వచ్చింది. వానకాలం సీజన్‌కు ముందే రైతులకు విత్తనాలు, ఎరువుల కష్టాలు మొదలయ్యాయి. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ సమస్య లేకుండా.. వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్న అన్నదాతలు.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. విత్తనాల స్టాక్ కొద్దిగా ఉండటం, భారీగా రైతులు తరలిరావడంతో సిబ్బందికి ఏం చేయాలో తోచక.. పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులపై భూమి విస్తీర్ణాన్ని బట్టి జీలుగ విత్తన సంచులను సరఫరా చేసేందుకు టోకెన్లు రాసిచ్చారు. అయినా.. గందరగోళం నెలకొనడంతో చివరకు పోలీసుల భద్రత నడుమ విత్తనాలు పంపిణీ చేశారు. పోలీస్ పహారాలో విత్తనాల పంపిణీ అన్నది కాంగ్రెస్ మార్క్ పరిపాలనకు కేరాఫ్ అడ్రస్ అంటూ రైతులు దుమ్మెత్తి పోశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇంత ఇబ్బంది ఎప్పుడూ పడలేదని, అప్పట్లో సవ్యంగా సాగిన ప్రక్రియకు ఇప్పుడు ఆటంకాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నిస్తున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంతోపాటు పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్ పాయింట్లు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా అందజేసే జనుము, జీలుగ బస్తాలు పంపిణీ చేయడంతో రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మల్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతుల పాసుపుస్తకాల జిరాక్స్ ప్రతులను క్యూలో పెట్టారు. మల్యాల, నూకపల్లి, పోతారం సహకార సంఘాల వద్ద రైతులకు ఎరువుల బస్తాలు లభ్యం కాకపోవడంతో నిరాశగా తిరిగి వెళ్లారు. ఈ విషయమై మల్యాల మండల వ్యవసాయాధికారి చంద్రదీపక్‌ను వివరణ కోరగా మండలానికి అవసరమయ్యే జీలుగ, జనుము బస్తాల కోసం పెట్టిన ఇండెంట్‌లో కేవలం 50 శాతం మాత్రమే రావడంతో రైతులకు సోమవారం బస్తాలు దొరకలేవని, మిగతా 50 శాతం బస్తాలు మరో మూడు రోజుల్లో వస్తాయని, రాగానే రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని డీసీఎంఎస్, ఏఆర్‌ఎస్‌కే కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న జీలుగ విత్తనాలను ఒక్కో పాస్‌బుక్‌కు ఒక్క బస్తానే ఇచ్చారు. దీంతో ఐదెకరాల భూమి ఉన్న వారికి ఒక బస్తా ఏమూలకు సరిపోతుందని ప్రశ్నించారు. ఒక్క బస్తా కోసం రోజంతా కేంద్రాల వద్ద పడికాపులు కాయాల్సి వచ్చిందని మండిపడ్డారు. డీసీఎంఎస్ నిర్వాహకుడు రైతుల పాస్ బుక్‌ల జిరాక్స్ తీసుకుని పేర్లు పిలుస్తూ రైతుకు ఒక బస్తా చొప్పున అందించారు.

విత్తనాల కోసం సర్కారుకు ఇండెంట్ పెట్టాం

కామారెడ్డి జిల్లాలో సోమవారం పీఏసీఎస్ ద్వారా రైతులకు 833 బస్తాల జీలుగ, 282 బస్తాల జనుము విత్తనాలను విక్రయించాం. ఏఈవోల ద్వారా సమాచారం అందించడంతో రైతులందరూ ఉదయమే పీఏసీఎస్‌కు చేరుకొని క్యూలో నిలబడ్డారు. ఆన్‌లైన్‌లో పర్మిట్, బిల్లు జనరేట్ చేసేందుకు సమయం పట్టడంతో లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. అదనంగా జీలుగ, జనుము విత్తనాలు కావాలని ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టాం. రాగానే సమాచారం ఇచ్చి అందరికీ పంపిణీ చేస్తాం.

-భాగ్యలక్ష్మి, కామారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి

మమ్మల్ని పట్టించుకుంటలేరు

జీలుగ విత్తనాల కోసం పొద్దున్నే కామారెడ్డికి వచ్చినం. మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు. పాస్‌బుక్ జిరాక్స్ తెచ్చుకోమన్నారు. దానిపై బస్తాలు రాసిచ్చిండ్రు. గంటల కొద్దీ నిలబడితే కానీ విత్తనాలు చేతికి రావడం లేదు. వరుసలో నిలబడినా విత్తనాలు దొరుకుతయో.. దొరుకవో తెలియని అయోమయం నెలకొంది.

-లింగం, రైతు, ఉగ్రవాయి

లోకం పోకడ

వడదెబ్బకు పడిపోయాడని ఆస్పత్రికి తీసుకెళ్దామంటే గాలివానకు కొట్టుకుపోతున్నాడు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	46.1°c	28.7°c
రంగారెడ్డి	42.4°c	22.9°c
నిజామాబాద్	42.3°c	29.3°c
ఖమ్మం	42.0°c	33.0°c
వరంగల్	42.0°c	32.0°c
కరీంనగర్	41.0°c	32.0°c
నల్లగొండ	40.8°c	25.9°c
మెదక్	40.7°c	25.7°c
మహబూబ్‌నగర్	40.7°c	28.4°c
హైదరాబాద్	37.8°c	27.0°c



దుబ్బాకలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై, ఏఈవోలు

దుబ్బాకలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

దుబ్బాక, మే 27: సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణాలను సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ, కల్తీ విత్తనాలు , ఎరువులు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సన్నబియ్యం టెండర్లు రద్దు

మొదటిపేజీ తరువాయి...

జరుగుతున్నదంటూ బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఆరోపించారు. సివిల్‌సప్లై శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషిస్తున్నారంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తడం, ప్రజల్లోనూ దీనిపై తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా సీరియస్ అయినట్టు తెలిసింది. వెంటనే సన్నబియ్యం కొనుగోలు టెండర్లను రద్దు చేయాలని అదేశించినట్టు సమాచారం. దీంతో అధికారులు టెండర్లను రద్దు చేశారు.

అయినవాళ్లకు అంటగట్టేందుకు?

ధాన్యం టెండర్లలో అధికారులు కొందరికి లాభం చేకూర్చేలా ప్రవర్తించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న 1.59 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని తక్కువ ధరకే విక్రయించి, మళ్లీ ఎక్కువ ధరకు సన్న బియ్యం కొనుగోలు చేయాలనే నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అందుబాటులో ఉన్న ధాన్యం అమ్మేసి, బియ్యం కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు వినిపించాయి. దీంతోపాటు ధాన్యం టెండర్లలో పాల్గొని టెండర్ దక్కించుకున్న సంస్థలే బియ్యం టెండర్లలో పాల్గొనడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ధాన్యం టెండర్లను దక్కించుకున్న ఈ సంస్థలు.. నిర్ణీత గడువులోగా ధాన్యం ఎత్తడంలో విఫలమయ్యాయి. అవే కంపెనీలకు బియ్యం టెండర్లను కట్టబెట్టాలని అనుకోవడంతో అనుమానాలు మరింత ఎక్కువయ్యాయి. ఇదంతా పక్కా ప్లాన్ ప్రకారమే జరుగుతున్నదనే విమర్శలు వినిపించాయి.

జలసౌధ చీకటి ఒప్పందమేమిటి?

- బిడ్డర్లకు, రైస్‌మిల్లర్లకు మధ్య బాండ్‌పేపర్ ఎందుకు?
- మంత్రి ఉత్తమ్‌కు బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): జలసౌధలో ఏప్రిల్ 18న బిడ్డర్లు, రైస్ మిల్లర్ల మధ్య జరిగిన చీకటి ఒప్పందం ఏమిటో చెప్పాలని ప్రభుత్వాన్ని బీజేపీ ఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రూ.100 స్టాంప్‌పేపర్ మీద బిడ్డర్లు, రైస్‌మిల్లర్లకు మధ్య ఎంవోయూ రాయించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రూ.2,007 విలువ చేసే బియ్యాన్ని మిల్లర్లే తిరిగి రూ.2,223కు బిడ్డర్ల నుంచి కొనుగోలు చేసేలా సంతకాలు తీసుకున్నది నిజం కాదా? అని నిలదీశారు. రూ.216 అధికంగా రాయించటం వల్ల రూ.800 కోట్లు అదనంగా వసూలు చేస్తున్నారని, ఈ డబ్బు ఎవరి ఖాతాల్లోకి వెళ్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. 1.50 లక్షల టన్నుల సన్నవడ్లను క్వింటాలుకు రూ.2,259కు బిడ్డర్లకు అమ్మి, ఓపెన్ మార్కెట్‌లో రూ.5,700కు క్వింటా బియ్యాన్ని ఎందుకు కొనుగోలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వడ్లను ప్రభుత్వమే మిల్లింగ్ చేసుకొని ఉంటే క్వింటాలుకు రూ.3,500 లోపే పడేదని తెలిపారు. గతంలో తాను ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్‌పై మాట్లాడినప్పుడు స్పందించని ఉత్తమ్.. ఇప్పుడు యూ ట్యాక్స్‌పై ప్రశ్నించగానే ఎదురుదాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. బకాయిలు ఉన్న రైస్‌మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో చెప్పాలని, డిఫాల్టర్ల పేర్లను బయటపెట్టాలని అన్నారు. తరుగు తీయటం లేదంటున్న మంత్రి.. క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారా? అని నిలదీశారు. ఒప్పందంలో అవినీతిపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం టెండర్లపై సిట్టింగ్ జడ్జి విచారణ జరపాలి

ఈ కుంభకోణంపై సీఎం స్పందించాలి • పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): సన్న బియ్యం టెండర్లలో జరిగిన కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. సన్న బియ్యం కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. పౌరసరఫరాల సంస్థ అవినీతి, టెండర్లలో అవకతవకలపై బీఆర్‌ఎస్ న్యాయ పోరాటం చేస్తుందని ప్రకటించారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పౌరసరఫరాల సంస్థ టెండర్లలో జరిగిన అవినీతిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధారాలతోపాటు బయటపెట్టారని గుర్తుచేశారు. టెండర్లు పిలిచింది నిజమా? కాదా? అన్నది చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్ మాటల్లో విషయం లేదని ఎద్దేవా చేశారు. కిలో రూ.57కు సన్నబియ్యం కొనాలని ప్రభుత్వమే టెండర్లలో అంత రేటు నిర్ణయిస్తే బహిరంగ మార్కెట్‌లో ధరల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.2,007 అని టెండర్లలో నిర్ణయిస్తే ఏజెన్సీలు రైస్‌మిల్లల వద్ద రూ.2,230 వసూలు చేయడం నిజం కాదా? అని నిలదీశారు. యుద్ధ విమానాలు నడిపిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని, పౌరసరఫరాల సంస్థలో ఆదాయం పెంచుతున్నామని చెప్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఎట్లా ఆదాయం పెంచారో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డిఫాల్టర్లను జైలుకు పంపించామని, ఆర్‌ఆర్ యాక్ట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రయోగించటంలేదని నిలదీశారు. టెండర్ల ఆరోపణలపై బీజేపీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక్కటేనని ఆరోపించారు.

ధాన్యం టెండర్లు రద్దా.. గడువు పొడిగింపా?

- ప్రభుత్వం తర్జనభర్జన
- ధాన్యం ఎత్తేందుకు బిడ్డర్లకు ఇచ్చిన గడువు 23తో పూర్తి
- జూన్ 6 తర్వాతే ప్రభుత్వ నిర్ణయం
- పౌరసరఫరాల సంస్థకు మరింత నష్టం

హైదరాబాద్, మే 27(నమస్తే తెలంగాణ): ధాన్యం టెండర్లను రద్దు చేయాలా? పౌరసరఫరాల సంస్థ విక్రయించిన ధాన్యం ఎత్తేందుకు బిడ్డర్లకు మరింత గడువు పొడించాలా? అనే అంశంపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆ తర్వాత ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. గడువు పొడిగించాలంటే ముఖ్యమంత్రి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అప్పటివరకు ఈ అంశాన్ని పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని గత ఫిబ్రవరిలో పౌరసరఫరాల సంస్థ గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించింది. టెండర్లలో పాల్గొన్న నాలుగు సంస్థలు ఈ ధాన్యాన్ని దక్కించుకున్నాయి. నిబంధనల ప్రకారం సదరు సంస్థలు మే 23 వరకు మొత్తం ధాన్యాన్ని ఖాళీ చేయాల్సి ఉన్నది. ఇప్పటివరకు 20% ధాన్యం కూడా ఎత్తకపోవడం గమనార్హం. ఈ ధాన్యం విలువ రూ.7 వేల కోట్ల వరకు ఉండగా, ఇప్పటివరకు రూ.200 కోట్ల విలువైన ధాన్యాన్ని మాత్రమే ఎత్తినట్టు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ వెల్లడించారు.

పెరగనున్న నష్టాలు

పౌరసరఫరాల సంస్థ అధికారులు, ప్రభుత్వం, బిడ్డర్లు వ్యవహరిస్తున్న తీరుతో పౌరసరఫరాల సంస్థకు వాటిల్లుతున్న నష్టాలు మరింత పెరుగుతున్నాయనే విమర్శలున్నాయి. సకాలంలో ధాన్యం ఎత్తి, అందుకు అవసరమైన డబ్బులు చెల్లిస్తే సంస్థపై ఆర్థికభారం తగ్గేది. ఇప్పుడు గడువు పొడిగించినా, రద్దు చేసినా సంస్థకు భారీ నష్టం తప్పదనే అభిప్రాయాలు పౌరసరఫరాల వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఎప్పుడు ఎంత ఎత్తితే అంత ధాన్యానికే డబ్బులు చెల్లించాలన్న నిబంధన పౌరసరఫరాల సంస్థను నష్టాల్లోకి నెట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే బిడ్డర్లలో భయం లేకుండా పోయిందని, వాళ్లకు వీలైనప్పుడు, బయట డిమాండ్‌కు అనుగుణంగా డబ్బులు చెల్లించి బియ్యం ఎత్తుతున్నారనే విమర్శలున్నాయి. ముందుగానే డబ్బులు చెల్లించాలనే నిబంధన పెట్టి ఉంటే, ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని భావిస్తున్నారు. బిడ్డర్లు ధాన్యం ఎత్తడంలో చేస్తున్న జాప్యం కారణంగా పౌరసరఫరాల సంస్థపై ప్రతి నెల సుమారు రూ.200 కోట్ల వరకు వడ్డీ భారం పడుతున్నట్టు సమాచారం. ఒకవేళ గడువు పొడిగిస్తే ఈ వడ్డీ భారాన్ని ఎవరు భరించాలనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మరో 5 రోజుల్లో కేరళకు రుతుపవనాలు

ఈ నెల 31 వరకు రాష్ట్రంలో ఎండల ప్రభావం

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): మరో ఐదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నదని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయని తెలిపింది. ఈ ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు తగ్గడంతోపాటు వివిధ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు. మూడురోజుల అనంతరం కొంత ఉపశమనం లభించనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 31 వరకు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని, దీని కారణంగా ఎండల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండంగా మారి తీవ్ర తుఫానుగా మారింది. ఆదివారం సాగర్ ఐలాండ్ వద్ద ఈ తుఫాను తీరం దాటింది. దీని ప్రభావంతో దక్షిణ తెలంగాణలో వర్షాలు పడనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళ, బుధ వారాల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నదని తెలిపింది. ఆదివారం రెమాల్ తుఫాన్ రాష్ట్రంలో బీభత్సమే సృష్టించింది. వేర్వేరు ఘటనల్లో 14 మంది చనిపోయారు. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో బలమైన గాలులు వీచాయి. దీంతో పలుచోట్ల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి.

కరెంట్ షాక్‌తో ఇద్దరి మృతి

అమ్మమ్మను కాపాడబోయి మనుమడు కూడా..

చిట్యాల (మొగుళ్లపల్లి), మే 27: విద్యుత్తు షాక్‌కు గురై ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం వెంకట్రావుపల్లి(సీ) గ్రామానికి చెందిన ముడితనపల్లి రామలక్ష్మి (60) భర్త రాజయ్య నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఒంటరిగా ఉన్న రామలక్ష్మిని పెద్ద కూతురు పిడిసిల్లలోని తన ఇంటికి తీసుకెళ్లింది. సోమవారం రామలక్ష్మి దండెంపైన ఆరేసిన బట్టలను తీస్తున్నది. ఈ క్రమంలో పక్క ఇంటికి వెళ్లే సర్వీస్ వైర్‌కు దండం తీగ ఆని ఉండటంతో విద్యుత్తు ప్రసారమై రామలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన ఆమె మనుమడు దుంప సాయిచరణ్ (15) అమ్మమ్మను కాపాడే క్రమంలో దండెం వైరును తొలగిస్తున్న క్రమంలో అతడికి కూడా షాక్ కొట్టడంతో మరణించాడు. దీంతో ఇరుకుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిందితుల అరెస్ట్

మిర్యాలగూడ/ కొడంగల్, మే 27: నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 25న మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆరు బస్తాల్లోని సుమారు రూ.5 లక్షల విలువైన 260 కిలోల పత్తి విత్తనాలను వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. అదే రోజు మిర్యాలగూడ రైల్వేస్టేషన్ వద్ద ముఠా సభ్యుల్లో ఒకరైనా ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పావులిపురం మండలం శానంపూడికి చెందిన గంధమల్ల శ్రీరంగా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా ముఠా గుట్టు రట్టయింది. పరారీలో ఉన్న ముగ్గురిని సోమవారం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జగదీశ్వర్‌రావు పరారీలో ఉన్నాడు. కాగా వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామంలో తనిఖీలు నిర్వహించి 9 క్వింటాళ్ల 72 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ భరత్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.16.77 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

నీటి పారుదల శాఖలో బదిలీలు

- కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్లపై ఫోకస్
- ఎక్స్‌టెన్షన్‌పై ఉన్న ఆఫీసర్లకు ఉద్వాసన
- ఐఎస్‌డబ్ల్యూఆర్‌కు మళ్లీ స్వతంత్రత
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- కోడ్ ముగిసిన వెంటనే ఉత్తర్వులు

హైదరాబాద్, మే27 (నమస్తే తెలంగాణ): నీటి పారుదల శాఖలో భారీగా బదిలీలు చేపట్టేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చించారు. ఈఈ నుంచి ఈఎన్సీ వరకు అందరినీ బదిలీ చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ సర్కిళ్ల చీఫ్ ఇంజినీర్లు విరమణ పొందగా వారిస్థానంలో వేరొకరికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ఈలు, ఈఈలు విరమణ పొందగా, ఈ నెలాఖరున మరికొందరు విరమణ చేయనున్నారు. ఇరిగేషన్‌శాఖలో కొత్త నియామకాల ప్రక్రియ పూర్తయింది. కోడ్ ముగిశాక ఉత్తర్వులిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది.

ఈఎన్సీల మార్పు..

నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్)గా మురళీధర్‌ను తప్పించిన తర్వాత ఈఎన్సీ (అడ్మినిస్ట్రేషన్) అనిల్‌కుమార్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అనిల్‌కుమార్‌ను ఈఎన్సీ జనరల్‌గా కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. వాలంతరి (వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) డైరెక్టర్ జనరల్‌గా ఉన్న రమేశ్ అకాలమ్రితితో డ్యామ్‌సేఫ్టీలో ఎస్ఈగా ఉన్న మురళీకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఈ నెలాఖరున విరమణ పొందనున్నారు.

ఎక్స్‌టెన్షన్లకు ఉద్వాసన

శాఖలో విరమణ పొందిన కొందరు ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతుండటంపై ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తుతుండడంతో ఆయా అధికారులకు ఉద్వాసన పలకాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. సీడీవో, జనరల్, క్వాలిటీ కంట్రోల్ ఇలా అన్ని విభాగాల్లో కలిపి 10మందికిపైగా ఇంజినీర్లు ఎక్స్‌టెన్షన్‌పై ఉన్నట్లు తెలుస్తున్నది. అత్యవసరమైతే విరమణపొందిన అనుభవజ్ఞులైన ఇంజినీర్లను కన్సల్టెంట్‌గా నియమించుకొని సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తున్నది.

మళ్లీ స్వతంత్రంగా ఐఎస్‌డబ్ల్యూఆర్

అంతర్రాష్ట్ర జల మండలి విభాగాన్ని మళ్లీ స్వతంత్రంగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. 2020లో నీటిపారుదల శాఖ పునర్వవస్థీకరణలో భాగంగా ఈ విభాగాన్ని కూడా ఈఎన్సీ జనరల్ కిందకు చేర్చి సీఈ పోస్టును రద్దు చేశారు.

ఓంకార్‌సింగ్ పదోన్నతి రద్దు!

నీటిపారుదల శాఖ ఎస్ఈ ఓంకార్‌సింగ్ పదోన్నతిని ప్రభుత్వం రద్దు చేసినట్టు తెలిసింది. ఆయనకు ఇటీవలే ఈఈ నుంచి ఎస్ఈగా పూర్తి అదనపుబాధ్యతలు అప్పగించారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణ సమయంలో ఓంకార్‌సింగ్ ఈఈగా ఉన్నారు. ప్రస్తుతం బరాజ్‌పై విచారణ జరుగుతున్న నేపథ్యంలో పదోన్నతి కల్పించడంపై విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్టు సమాచారం.

మేడిగడ్డ బరాజ్‌లో పనులను పరిశీలిస్తున్న ఈఎన్సీ అనిల్‌కుమార్ బృందం

మేడిగడ్డను పరిశీలించిన ఈఎన్సీ

మహదేవపూర్/కాళేశ్వరం, మే 27 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌ను ఈఎన్సీ అనిల్ కుమార్ బృందం సోమవారం సందర్శించింది. బరాజ్ ఏడో బ్లాక్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు బరాజ్‌లో చేపడుతున్న పనుల్లో భద్రతా చర్యలు పాటిస్తూ వేగం పెంచాలని ఈఎన్సీ ఆదేశించారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన 19, 20, 21 పియర్ల వద్ద జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. షీట్ ఫైల్స్, మట్టి రహదారి నిర్మాణ పనులు, ఆర్క్ గ్రౌటింగ్ పరికరంలో జరుగుతున్న 20,21వ గేట్ కట్టింగ్‌ను, సీసీ బ్లాక్‌ల అమరిక, కుంగిన పియర్ల పునాదుల కింద ఏర్పడ్డ ఖాళీ ప్రదేశాలను సిమెంట్, ఇసుకతో నింపేందుకు జరుగుతున్న బోర్‌హోల్ పనులు, కుంగిన పియర్ల వద్ద ఏర్పడ్డ బొరియల పూడ్చివేత పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎల్‌టీ ప్రతినిధులతో చర్చించి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుకను రాళ్లను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు, డీఈ సూర్యప్రకాశ్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అన్నారం బరాజ్ సందర్శన

కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతీ) బరాజ్‌ను ఈఎన్సీ అనిల్ సందర్శించారు. బరాజ్ పైన తీస్తున్న ఇసుకను పరిశీలించారు. అనంతరం బరాజ్ కింది వైపునకు వెళ్లి అక్కడ జరుగుతున్న పనుల గురించి తెలుసుకొన్నారు. లీకేజీ తదితర పనులను వర్షాకాలం రాక ముందే పూర్తి చేయాలని సూచించారు. మేడిగడ్డ నుంచి కన్నేపల్లి పంప్‌హౌస్ వరకు నీటిని ఆపగలమా? అని అధికారులతో చర్చించారు. అనంతరం గ్రావిటీ కెనాల్ నుంచి కన్నేపల్లి (లక్ష్మీ) పంప్‌హౌస్‌ను సందర్శించారు. వీరి వెంట సీఈ సుధాకర్‌రెడ్డి, సీఈ సీడీవో మోహన్‌రావు, ఈఈ తిరుపతిరావు, ఐఐటీ ప్రొఫెసర్ శశిధర్‌రావు, రిటైర్డ్ సీఈ సీడీవో తదితరులు ఉన్నారు.

ఇరిగేషన్ సలహాదారు రంగారెడ్డి కన్నుమూత



హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): విశ్రాంత ఇంజినీరు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల సలహాదారు నల్లవెల్లి రంగారెడ్డి ఇటీవల ఇంట్లో కాలు జారి పడడంతో మాదాపూర్ యశోద వైద్యశాలలో చేరారు. మల్టిపుల్ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ వల్ల పరిస్థితి విషమించి సోమవారం తుదిశ్వాస విడిచారు. నాగర్‌కర్నూల్ మండలం గన్యాగులకు చెందిన ఆయనకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో మంగళవారం రంగారెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు వెల్లడించారు. ఎస్ఈగా పదవీ విరమణ చేసిన రంగారెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌కు పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ స్కీం ఓఎస్డీగా సేవలందించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించడంతోపాటు ఏఎమ్మార్పీఎస్ ఎల్‌బీసీలోనూ సేవలందించారు. ప్రభుత్వం ఇటీవల ఆయనను పాలమూరు ప్రాజెక్టుల సీనియర్ సలహాదారుగా నియమించగా ఆరోగ్యం కుదుటపడ్డాక బాధ్యతలు స్వీకరించాలని రంగారెడ్డి భావించారు.

సీఎం సంతాపం

రంగారెడ్డి మృతికి సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయడానికి ఇటీవలే ఆయనను సలహాదారుగా నియమించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే ఇరిగేషన్ ఇంజినీర్లు సంతాపం ప్రకటించారు.

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సంతాపం

రంగారెడ్డి మృతిపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. పాలమూరు నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో రంగారెడ్డి కృషి మరవలేనిదని కొనియాడారు.